ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జయశంకర్ భూపాలపల్లి
ములుగు
5
ఆదివారం 16 జూన్ 2024

ఈసీ లేదు.. వీసీ లేదు..



(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

కాకతీయ యూనివర్సిటీలో పాలన అస్తవ్యస్తంగా మారింది. 8 నెలలుగా పాలక మండలి (ఈసీ), మే 21వ తేదీ నుంచి పూర్తి స్థాయి వైస్‌చాన్సలర్ లేక కేయూలో పాలన గాడి తప్పుతోంది. 2024-25 విద్యా సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో ఈసీ, వీసీ లేకపోవటంతో వర్సిటీకి సంబంధించిన ప్రధానమైన నిర్ణయాలు తీసుకునే పరిస్థితి లేకుండాపోయింది. రాష్ట్రంలో అన్ని యూనివర్సిటీలకు వీసీల నియామకం కోసం సెర్చ్ కమిటీలను నియమించిన ప్రభుత్వం.. కేయూకి మాత్రం ఈసీ లేకపోవటంతో కమిటీ వేయలేకపోయింది. దీంతో కొత్త పాలక మండలి ఎప్పుడు వస్తుందో..? యూనివర్సిటీకి కొత్త వీసీని ఎప్పుడు నియమిస్తారో? అనే ఉత్కంఠతో ప్రొఫెసర్లు, విద్యార్థులు ఎదురు చూస్తున్నారు.

ముగిసిన ఈసీ, వీసీల పదవీకాలం

పైరవీలు, అక్రమాలు, అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారిన కాకతీయ యూనివర్సిటీ ప్రక్షాళన కలగానే మారుతోంది. పాలకమండలికి కొత్త కమిటీని నియమించటంలో చేస్తున్న తాత్సారం విద్యార్థుల భవిష్యత్తుపై ప్రభావం చూపుతోంది. గత అక్టోబరు 22వ తేదీనే కేయూ పాలక మండలి పదవీకాలం ముగిసింది. అక్టోబరు, నవంబరు నెలల్లో ఎన్నికల కోడ్ కారణంగా కొత్త ఈసీలను నియమించటం కుదరలేదు. తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం కాకతీయ యూనివర్సిటీని ప్రక్షాళన చేస్తామని మాట ఇచ్చింది. అయితే ఇప్పటి వరకు కనీసం కొత్త ఎగ్జిక్యూటివ్ కమిటీని ప్రభుత్వం నియమించలేదు. దీంతో యూనివర్సిటీలో కీలకమైన నిర్ణయాలు తీసుకోవటంతో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. కాగా, గత నెల 21వ తేదీన కేయూ వైస్ చాన్సలర్ రమేష్ పదవీకాలం పూర్తి అయింది. దీంతో కేయూకు సీనియర్ ఐఏఎస్ అధికారిణి కరుణను ఇన్‌చార్జి వీసీగా ప్రభుత్వం నియమించింది. ఇదిలా వుండగా, 2024-25 విద్యా సంవత్సరం ప్రారంభం కావటంతో యూనివర్సిటీలో కొత్త కోర్సుల ప్రవేశ పెట్టడంతో పాటు వేతనాలు, ఉద్యోగ నియామకాలు, కొత్త ప్రాజెక్టుల నిర్వహణకు కావాల్సిన బడ్జెట్‌తో పాటు కేయూ భూముల అక్రమణాలు, వివిధ కమిటీల నివేదికలపై నిర్ణయం తీసుకోవాల్సిన పాలకమండలి, పూర్తిస్థాయి వైస్‌చాన్సలర్ లేకపోవటం సమస్యాత్మకంగా మారింది.


కేయూ

సెర్చ్ కమిటీ కూడా లేదాయే..

కాకతీయ యూనివర్సిటీకి వైస్‌చాన్సలర్‌ను నియమించేందుకు ప్రభు త్వం సెర్చ్ కమిటీని కూడా నియమించ లేదు. సెర్చ్ కమిటీలో ముగ్గురు సభ్యులను నియమిస్తారు. వీరిలో ఒకరు ప్రభుత్వం నుంచి, మరొకరు విద్యాశాఖ నుంచి ఉంటారు. ఇంకొకరిని యూనివర్సిటీ పాలక మండలి నుంచి సూచిస్తారు. ఈ ముగ్గురు నేతృత్వంలో సెర్చ్ కమిటీ వైస్‌చాన్సలర్‌ను ఎంపికచేసి ప్రభుత్వానికి నివేదిక పంపిస్తుంది. అయితే రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీలలో పూర్తి స్థాయి పాలక మండలి ఉన్నప్పుడే సెర్చ్ కమిటీ సభ్యుడి పేరును ఖరారు చేసి ప్రభుత్వానికి పంపించారు. అయితే కేయూ నుంచి మాత్రం సెర్చ్ కమిటీ సభ్యుడిని ఎంపిక చేయకుండానే అక్టోబరులో పాలక మండలి పదవీకాలం పూర్తయింది. గత వీసీ నిర్లక్ష్యంతో సెర్చ్ కమిటీని ఎంపిక చేయలేదని ఆకుట్ సభ్యులు విమర్శిస్తున్నారు.

దరఖాస్తు చేసుకున్నా..

రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీలకు వైస్‌చాన్సలర్ నియామకం కోసం ప్రభుత్వం జనవరి 27వ తేదీన నుంచి ఫిబ్రవరి 12వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరించింది. కాకతీయ

» మిగతా 8వ పేజీలో...

- కాకతీయ యూనివర్సిటీకి దిక్కెవరు?
- పాలక మండలి ఏర్పాటులో తాత్సారం
- గత అక్టోబరులోనే ముగిసిన ఈసీ పదవీకాలం
- మే 21న ముగిసిన వైస్ చాన్సలర్ పదవీకాలం
- ఇన్‌చార్జి వీసీ పాలనలోనే వర్సిటీ
- కేయూలో కీలక నిర్ణయాలపై ప్రభావం
- ఈసీ లేకపోవడంతో ఏర్పాటు కాని సెర్చ్ కమిటీ
- కేయూ ప్రక్షాళనపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని విజ్ఞప్తులు

పాలకమండలి - విధులు

యూనివర్సిటీలో 13మందితో పాలక మండలిని నియమిస్తారు. ప్రతీ యూనివర్సిటీ ఈసీకి వైస్ చాన్సలర్ చైర్మన్‌గా వ్యవహరిస్తారు. మిగతా 13 మంది సభ్యుల్లో విద్యాశాఖ, ఆర్థికశాఖ, కళాశాల విద్యాశాఖ కమిషనర్, (సాంకేతిక యూనివర్సిటీ అయితే సాంకేతిక విద్యాశాఖ కమిషనర్) ఎక్స్ అఫీషియో సభ్యులుగా ఉంటారు. అలాగే యూనివర్సిటీ కాలేజీల నుంచి ఒక ప్రిన్సిపాల్, ఇద్దరు అధ్యాపకులు, డిగ్రీ కాలేజీల నుంచి ఒక ప్రిన్సిపాల్, ఒక అధ్యాపకుడు, సమాజంలో వివిధ రంగాలకు చెందిన ప్రముఖులను నలుగురిని కలుపుకుని మొత్తం 13మందితో సభ్యులను ప్రభుత్వం నియమిస్తుంది. ఈ కమిటీ తీసుకునే నిర్ణయమే విధానంగా మారుతుంది. యూనివర్సిటీకి సంబంధించిన ఏ పని చేయాలన్న ఈసీ అనుమతి తప్పనిసరి. దానినే వీసీ అమలు చేస్తారు. అంతేకాకుండా అకడమిక్, అడ్మినిస్ట్రేషన్, ప్రమోషన్స్, ఉద్యోగాల భర్తీ, సైంటిఫిక్ పరికరాలు, ల్యాబ్ వస్తువుల కొనుగోలు, యూజీసీ నిధులు వినియోగం ఇలా అన్నింటికీ ఈసీ ఆమోదం తప్పనిసరి.

అంగన్‌వాడీ సెంటర్లలో మెరుగైన సేవలు

సంక్షేమ శాఖ జిల్లా అధికారి స్వర్ణలత లెనినా


అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు విద్యాభ్యాసం చేయిస్తున్న సంక్షేమ శాఖ జిల్లా అధికారి స్వర్ణలత లెనినా

ఏటూరునాగారం రూరల్, జూన్ 15: అంగన్‌వాడీ కేంద్రాల్లో మెరుగైన సేవలు అందించడమే లక్ష్యమని సంక్షేమ శాఖ జిల్లా అధికారి జె.ఎం.స్వర్ణలత లెనినా తెలిపారు. ఇందుకు అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు కృషి చేయాలని అన్నారు. మండలంలోని గుండెంగవాయి, అల్లంవారిఘణపురం గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె శనివారం సందర్శించారు. గర్భిణులు, బాలింతలు, పిల్లలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. జిల్లా బాలల పరిరక్షణ విభాగం, చైల్డ్‌లైన్ ఆధ్వర్యంలో పిల్లలను బడిలో చేర్పించేలా తల్లిదండ్రులు ముందుకు రావాలని గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బడికెళ్లే పిల్లలను పనికి పంపొద్దన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందిస్తున్నామని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. మహిళల్లో రక్తహీనత సమస్యలను తగ్గించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. అనంతరం ప్రియనేస్తం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గొత్తికోయ పిల్లలకు పుస్తకాలు, పలక, ఆహార పదార్థాలను అందించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీ విద్య, జిల్లా బాలల పరిరక్షణ విభాగం అధికారి హరికృష్ణ, ప్రియనేస్తం చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు పింగిళి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు కలెక్టర్ల బదిలీ

భవేష్ మిశ్రా, ఇలా త్రిపాఠికి స్థానచలనం

కొత్తగా భూపాలపల్లికి రాహుల్ శర్మ

ములుగుకు దివాకర


భూపాలపల్లి నూతన కలెక్టర్ రాహుల్‌శర్మ


ములుగు కొత్త కలెక్టర్ దివాకర

భూపాలపల్లి కలెక్టరేట్/ములుగు కలెక్టరేట్, జూన్ 15: భూపాలపల్లి, ములుగు కలెక్టర్లు భవేష్ మిశ్రా, ఇలా త్రిపాఠి బదిలీ అయ్యారు. భూపాలపల్లికి రాహుల్ శర్మ, ములుగుకు దివాకర బదిలీపై వస్తున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. 2017 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన రాహుల్ శర్మ ప్రస్తుతం వికారాబాద్ అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థల)గా పనిచేస్తున్నారు. భూపాలపల్లి కలెక్టర్‌గా ఆదివారం బాధ్యతలు స్వీకరించనున్నారు. భూపాలపల్లి కలెక్టర్‌గా పనిచేసిన భవేష్ మిశ్రాకు ప్రభుత్వం ఎలాంటి పోస్టింగ్ ఇవ్వలేదు. దీంతో ఆయన జీఏడీలో రిపోర్ట్ చేయనున్నారు.

ములుగు కలెక్టర్‌గా పనిచేస్తున్న ఇలా త్రిపాఠి బదిలీ కాగా ఆమె స్థానంలో జగిత్యాల జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా కొనసాగుతున్న 2017 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన దివాకరకు బాధ్యతలు అప్పగించారు. 2021 ఆగస్టు నుంచి 2023 జూలై 15వరకు జయశంకర్ భూపాలపల్లి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా ఆయన విధులు నిర్వర్తించారు. ములుగు కలెక్టర్‌గా ఆదివారం బాధ్యతలు స్వీకరించనున్నారు. ఇక్కడ నుంచి బదిలీ అయిన ఇలా త్రిపాఠి అదనపు కలెక్టర్‌గా 2021 అక్టోబరులో బాధ్యతలు స్వీకరించారు. మూడేళ్లుగా జిల్లాలో పనిచేస్తున్నారు. 2023 జూలై 15న అప్పటి వరకు కలెక్టర్‌గా పనిచేసిన కృష్ణఆదిత్య బదిలీ కాగా ఆయన స్థానంలో ఇలా త్రిపాఠి నియమితులయ్యారు. మేడారం జాతర, ఇటీవల జరిగిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలను విజయవంతంగా జరిపించడంలో ఆమె విశేషంగా కృషి చేశారు. గత ఏడాది ఏజెన్సీ తీవ్ర వరద ముంపునకు గురికాగా మెరుగైన సహాయక చర్యలు చేపట్టి ప్రశంసలు పొందారు. ములుగు నుంచి బదిలీ అయిన ఆమెకు ప్రభుత్వం ఇంకా ఎలాంటి పోస్టింగ్ కేటాయించలేదు. బదిలీపై వెళ్తున్న భవేష్ మిశ్రా, ఇలా త్రిపాఠి భార్యాభర్తలు. వీరిద్దరు పక్కపక్క జిల్లాలకు కలెక్టర్లుగా విధులు నిర్వర్తించడం విశేషం.

ములుగు జిల్లాలో సీఐల బదిలీలు

ములుగు, జూన్ 15: జిల్లాలో పనిచేస్తున్న ఐదుగురు సీఐలు బదిలీ అయ్యారు. ఈమేరకు మల్టీజోన్-1 ఐజీ ఏవీ.రంగనాథ్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలో మొత్తం నాలుగు సర్కిళ్లు ఉన్నాయి. గతంలో ఎప్పుడూ లేని విధంగా ఒకేసారి అన్ని స్థానాల్లో పనిచేస్తున్న వారిని వేర్వేరు చోట్లకు మార్చడం పోలీసు శాఖలో చర్చనీయాంశమైంది.

పేరు	ప్రస్తుతం	బదిలీ
వి.శంకర్	పస్రా	ములుగు
ఎం.రంజిత్‌కుమార్	ములుగు	ఐజీ కార్యాలయంలో రిపోర్ట్
అనుముల శ్రీనివాస్	సీసీఎస్-ములుగు	ఏటూరునాగారం
మండల రాజు	ఏటూరునాగారం	ఐజీ కార్యాలయంలో రిపోర్ట్
ముత్యాల రమేష్	పీసీఆర్-కొత్తగూడెం	వెంకటాపురం
బండారి కుమార్	వెంకటాపురం	ఐజీ కార్యాలయంలో రిపోర్ట్

మావోయిస్టుల కుట్ర భగ్నం

మందుపాతరలు అమర్చుతున్న ఆరుగురి అరెస్టు

వీరిలో డిప్యూటీ దళకమాండర్ రీతా

తుపాకీ, కిట్‌బ్యాగులు, వాకీటాకీలు, పేలుడు సామగ్రి స్వాధీనం


మావోయిస్టులు, మిలీషియా సభ్యులను అరెస్టు చూపిస్తున్న ఎస్పీ

ములుగు, జూన్ 15: మావోయిస్టుల భారీ కుట్రను ములుగు జిల్లా పోలీసులు భగ్నం చేశారు. వెంకటాపురం(నూగూరు) మండలం తడపల గ్రామ సమీపంలో మందుపాతరలను అమర్చుతున్న ఆరుగురిని ఈనెల 13న అదుపులోకి తీసుకొని పెద్దఎత్తున పేలుడు సామగ్రిని స్వాధీనపర్చుకున్నారు. ములుగులోని జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ శబరీశ్ శనివారం వారిని అరెస్టు చూపిస్తూ వివరాలను వెల్లడించారు. కర్రెగుట్టలపై గెరిల్లా బేస్‌క్యాంపును ఏర్పాటు చేయడంలో భాగంగా మావోయిస్టు పార్టీ వెంకటాపురం-వాజేడు ఏరియా, దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీకి చెందిన నక్సలైట్లు, మిలీషియా సభ్యులతో కలిసి మందుపాతరలు అమర్చుతున్నట్లు అందిన సమాచారం మేరకు పోలీసు కూంబింగ్ చేస్తుండగా ఆరుగురు అనుమానితులు పారిపోయేందుకు ప్రయత్నించారు. వారిని అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారించారు. పట్టుబడిన వారిలో వెంకటాపురం-వాజేడు ఏరియా కమిటీ డిప్యూటీ దళకమాండర్ కారం బుద్రి అలియాస్ రీతా, పామేడు ఏరియా కమిటీ సభ్యురాలు సోడి కోసి అలియాస్ మోతె, ఒకటో బెటాలియన్ సభ్యుడు సోడి విజయ్ అలియాస్ ఇడుమ, మిలీషియా సభ్యులు కుడం దస్రు, సోడి ఉర్ర, మడకం భీమ ఉన్నారు. వారి నుంచి డీబీబీఎల్ తుపాకీ, రెండు వాకీటాకీలు, నాలుగు కిట్‌బ్యాగులు, కార్డెక్స్ వైరు, ప్రెషర్ కుక్కర్, ఎలక్ట్రికల్ వైరు, స్విచ్, రెండు కత్తులు, ఆరు మొబైల్ చార్జర్లు, ఐదు కారు తాళాలు, మూడు టార్చిలైట్లు, రేడియో, బుల్లెట్లు తదితర పేలుడు సామగ్రి స్వాధీనపర్చుకున్నారు. రీతాపై 30 కేసులు ఉన్నాయని, ఐఈడీలు అమర్చిన 24 కేసులతోపాటు మదారి భీమేశ్వర్‌రావు, కోర్స రమేష్ హత్య, ఇటీవల ఏసు అనే వ్యక్తి మరణించిన కేసులోనూ నిందితురాలిగా ఉన్నారని ఎస్పీ తెలిపారు. మిగతా వారిపై కూడా హత్యలు, ఐఈడీలు అమర్చిన కేసులు ఉన్నాయన్నారు. మావోయిస్టులు స్వచ్ఛందంగా జనజీవన స్రవంతిలో కలిసి సాధారణ జీవితం గడపాలని ఎస్పీ సూచించారు. వారికి ప్రభుత్వం పక్షాన పునరావాసం కల్పిస్తామని తెలిపారు. నిషేధిత మావోయిస్టులకు ప్రజలు సహకరించొద్దని కోరారు. ఈ కార్యక్రమంలో ఏటూరునాగారం ఏఎస్పీ గీతే మహేష్, ములుగు డీఎస్పీ రవీందర్, వెంకటాపురం సీఐ కుమార్, ఎస్సైలు తిరుపతిరావు, అశోక్ పాల్గొన్నారు.

గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్వాసిత రైతుల రాస్తారోకో


రాస్తారోకో చేస్తున్న గ్రీన్‌ఫీల్డ్ నేషనల్ హైవే నిర్వాసిత రైతులు

భూపాలపల్లి కలెక్టరేట్, జూన్ 15: భూపాలపల్లి జిల్లా మీదుగా నిర్మిస్తున్న గ్రీన్‌ఫీల్డ్ నేషనల్ హైవేకు భూములు ఇచ్చేది లేదని రైతులు తేల్చి చెప్పారు. టేకుమట్ల, చిట్యాల, మొగుళ్లపల్లి మండలాలల్లోని 14 గ్రామానికి చెందిన రైతులు భూపాలపల్లి కలెక్టరేట్ ఎదుట ప్రధాన రహదారిపై శనివారం రాస్తారోకో చేశారు. అంతకు ముందు కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో కలెక్టర్ భవేష్ మిశ్రా మాట్లాడుతూ గ్రీన్ హైవే నిర్మాణ విషయంలో ప్రభుత్వ నిబంధనల మేరకు నడుచుకుంటామని చెప్పడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేశారు. తమకు వ్యవసాయమే జీవనాధారమని, గ్రీన్ హైవే పేరిట భూములు ఇస్తే బతికేలా..? అని ఆవేదన వ్యక్తం చేశారు. సారవంత భూములలు హైవే పేరిట తీసుకుంటామని ఎలాగని ప్రశ్నించారు. భూములు ఇవ్వాల్సి వచ్చినా ప్రభుత్వం ఇచ్చే పరిహారం ఏమాత్రం సరిపోదని అన్నారు.


తమ భూములను తీసుకోవద్దంటూ కలెక్టర్ సమావేశంలో సాష్టాంగ నమస్కారం చేస్తున్న మహిళా రైతు

భూసేకరణ చట్టం ప్రకారమే పరిహారం..

గ్రీన్‌ఫీల్డ్ నేషనల్ హైవే భూసేకరణలో భూములు కోల్పోతున్న రైతులకు భూసేకరణ చట్టం ప్రకారమే పరిహారం చెల్లిస్తామని కలెక్టర్ భవేష్ మిశ్రా అన్నారు. గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవేలో భూములు కోల్పోతున్న రైతులు, సంబంధిత అధికారులతో ఆయన కలెక్టరేట్‌లో సమావేశమయ్యారు. దీనిపై రైతులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రభుత్వం నిర్ణయించిన పరిహారం తమకు ఏమాత్రం సరిపోదన్నారు. ఓ మహిళా రైతు కలెక్టర్‌తో మాట్లాడుతూ తమకు జీవనాధారమైన భూములు తీసుకుంటే కుటుంబాలు ఆగమవుతాయని ఆవేదన వ్యక్తం చేసింది. తమ భూములు తీసుకోవద్దని సాష్టాంగ ప్రమాణం చేసింది.

నేడు సివిల్స్ ప్రిలిమినరీ పరీక్ష

ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

హనుమకొండ కలెక్టరేట్, జూన్ 15: యూపీఎస్సీ సివిల్స్ ప్రిలిమినరీ పరీక్షకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఆదివారం జరిగే ఈ పరీక్షకు హనుమకొండ జిల్లాలో 11 కేంద్రాలు ఏర్పాటు చేయగా, 4,730 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారు. పరీక్ష రెండు సెషన్లలో జరుగుతుంది. ఉదయం 9:30 గంటల నుంచి 11:30 గంటలకు జరుగుతుంది. అలాగే మధ్యాహ్నం 2:30 గంటల నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు జరుగుతుంది. ఉదయం సెషన్‌కు అభ్యర్థులను ఉదయం 9గంటల నుంచే పరీక్షా హాల్‌లోకి అనుమతిస్తారు. మధ్యాహ్నం సెషన్‌కు 2గంటల నుంచి పరీక్షాహాల్‌లోకి అనుమతించనున్నారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థుల కోసం టీజీఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేశారు. యూపీఎస్సీ సివిల్స్ ప్రిలిమినరీ పరీక్ష జరిగే కేంద్రాల వద్ద 144సెక్షన్ అమలులో ఉంటుంది. ఆయా పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాల్లో ఉన్న జిరాక్స్ సెంటర్లు మూసి వేయనున్నారు. పరీక్ష కేంద్రాల వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లు, అత్యవతసర మెడికల్ ఎమర్జెన్సీ సదుపాయాలు ఉంటాయి. పరీక్ష కేంద్రాల్లో ఎలాంటి అవాంతరాలు లేకుండా నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా అధికారులు ఏర్పాట్లు చేశారు.

నగరంలో 144 సెక్షన్

వరంగల్ క్రైం: సివిల్స్ పరీక్ష సజావుగా నిర్వహించేందుకు గాను ఆదివారం వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు ఇన్‌చార్జి కమిషనర్ అభిషేక్ మోహంతి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు సభలు, సమావేశాలు, ర్యాలీలు, ధర్నాలు నిర్వహించరాదని ఆయన పేర్కొన్నారు. ఆదేశాలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

భర్త వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్య



ఆత్మహత్య చేసుకున్న వనిత

వరంగల్ క్రైం, జూన్ 15: భర్త వేధింపులు తట్టుకోలేక మాలోతు వనిత(36) అనే మహిళ ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన సంఘటన సుబేదారి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. స్టేషన్ పరిధిలోని దీన్‌దయాల్‌నగర్‌కు చెందిన బానోతు వీరస్వామి తన కూతురు వనితను 2014లో చెన్నరావుపేట టీకే తండాకు చెందిన మాలోతు బన్సీలాల్‌కు ఇచ్చి వివాహం చేశాడు. వివాహ సమయంలో రూ.20లక్షల కట్నం, బంగారు ఇచ్చాడు. హైదరాబాద్‌లో రైల్వేలో ఉద్యోగం చేసే బన్సీలాల్ చెడు వ్యసనాలకు అలవాటుపడి భార్య వనితను వేధిస్తున్నాడు. వనితను బన్సీలాల్‌తో పాటు సోదరుడు, అతడి భార్య వేధిస్తున్నారు. ఇటీవల హనుమకొండలోని పుట్టింటికి వచ్చిన వనిత.. ఈనెల 10న చున్నీతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఎంజీఎంకు తరలించారు. మెరుగైన చికిత్స కోసం శుక్రవారం హైదరాబాద్ యశోదకు తరలించారు. చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది. తన కూతురు మృతికి కారకులైన అల్లుడు, అతడి సోదరుడు, అతడి భార్యపై శనివారం వీరస్వామి సుబేదారి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేస్తున్నారు.

కేయూలో ఇద్దరికి డాక్టరేట్



పి. స్వప్న



పుల్ల శ్రీనివాస్

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 15: కేయూలో ఇద్దరు పరిశోధక విద్యార్థులకు డాక్టరేట్‌ను ప్రకటిస్తూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ ఎస్.నర్సింహాచారి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. కామర్స్ విభాగంలో 'పెర్ఫార్మెన్స్ ఎవాల్యుయేషన్ ఆఫ్ పవర్ సెక్టార్ ఎ స్టడీ' అనే అంశంపై కేయూ ప్రొఫెసర్ డి.సక్రియ పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేసిన పుల్ల శ్రీనివాస్‌కు డాక్టరేట్ ప్రకటించారు. అలాగే తెలుగులో రావికంటి వసునందన్ వచన రచనలు-సమగ్ర అధ్యయనం అనే అంశంపై రిటైర్డ్ ప్రొఫెసర్ బన్న ఐలయ్య పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేసిన పి.స్వప్నకు డాక్టరేట్‌ను ప్రకటించారు.

ట్యాక్స్ బార్ పాలక మండలి సభ్యుడిగా పీవీ నారాయణరావు



పీవీ నారాయణరావు


వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 15: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రెండు రాష్ట్రాల ట్యాక్స్ బార్ అసోసియేషన్ పాలక మండలి సభ్యుడిగా వరంగల్‌కు చెందిన ప్రముఖ చార్టెడ్ అకౌంటెంట్ పీవీ నారాయణరావు నియామకమయ్యారు. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడు బొజ్జ మధుసూదన్ వెల్లడించారు. ఈ సందర్భంగా నారాయణరావు మాట్లాడుతూ.. రెండు తెలుగు రాష్ట్రాల్లో సేవలను అందిస్తున్న అసోసియేషన్ సభ్యుల సంక్షేమం కోసం నిరంతం కృషి చేస్తానన్నారు.

భద్రాచలం - వరంగల్ మధ్యనే 'సింగరేణి'

గిర్మాజీపేట, జూన్ 15: వరంగల్ - బల్లార్ష రైల్వే మార్గంలోని ఆసిఫాబాద్ - రేచిణి మధ్య జరుగుతున్న మూడో లైను పనుల్లో భాగంగా ఈ మార్గంలో పలు రైళ్లను పాక్షికంగా రద్దు, దారి మళ్లింపు చేసినట్లు దక్షిణమధ్య రైల్వే శనివారం రాత్రి విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. ఇందులో భాగంగా ప్రతీ రోజు భద్రాచలం రోడ్డు (కొత్తగూడెం) నుంచి వరంగల్ మీదుగా బల్లార్ష వెళ్లే సింగరేణి ఫాస్ట్ ప్యాసింజర్ సోమవారం నుంచి జూలై 6 వరకు భద్రాచలం - వరంగల్ మధ్యే నడుస్తుందని పేర్కొంది. ప్రతీ రోజు మాదిరిగానే సింగరేణి ఉదయం 5.55 గంటలకు భద్రాచలం రోడ్డు నుంచి బయలుదేరి వరంగల్‌కు ఉదయం 8.44 గంటలకు చేరుకుంటుందని తెలిపింది. అలాగే వరంగల్ నుంచి మధ్యాహ్నం 3.45 గంటలకు బయలుదేరి రాత్రి 8.20 భద్రాచలం రోడ్డు చేరుకుంటుందని పేర్కొంది. హైదరాబాద్ నుంచి కాజీపేట మీదుగా సిర్పూర్ కాగజ్‌నగర్‌కు నడిచే హైదరాబాద్- సిర్పూర్‌కాగజ్‌నగర్, సికింద్రాబాద్ నుంచి కాజీపేట మీదుగా సిర్పూర్‌కాగజ్‌నగర్ నడిచే సికింద్రాబాద్ - సిర్పూర్‌కాగజ్‌నగర్ రైళ్లు సోమవారం నుంచి జూలై 6 వరకు హైదరాబాద్ - కాజీపేట, సికింద్రాబాద్ - కాజీపేట మధ్యనే నడుస్తాయని రైల్వే అధికారులు తెలిపారు.

అప్రమత్తతే ఆరోగ్య ఆయుధం

● వర్షాకాలంలో వ్యాధుల భయం ● వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతతో నివారణ ● ప్రాథమిక దశలోనే చికిత్స పొందాలి



వరంగల్ మెడికల్, జూన్ 14: రానున్న కాలంలో సీజనల్ వ్యాధులు విజృంభించే ప్రమాదం ఉంది. వర్షాకాలంలో నీటి నిల్వలు ఉండటంతో దోమలు, ఈగలు వృద్ధి చెంది అంటువ్యాధులు వేగంగా విస్తరించే అవకాశం ఉందని వైద్యులు పేర్కొంటున్నారు. కలుషిత నీటివల్ల డయేరియా, అతిసారం వంటి వ్యాధులు విస్తృతంగా వస్తాయి. దీనికి తోడు దోమకాటు కారణంగా మలేరియా, డెంగీ, చికున్‌గున్యా వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉందని వైద్యులు పేర్కొంటున్నారు. వైద్య, ఆరోగ్యశాఖ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు ప్రణాళిక రచించినప్పటికీ వ్యక్తిగతంగా ఎవరికి వారు కొన్ని నియమాలు తప్పక పాటించాల్సిన అవసరం ఉంది. సమాజ ఆరోగ్యం కోసం సమష్టిగా పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలి.

వైరల్ ఫీవర్ (విష జ్వరం)

వాతావరణంలో మార్పులు, కొన్నిరకాల వైరస్‌ల కారణంగా వైరల్ ఫీవర్ సోకుతుంది. ఇంట్లో ఒకరికి వస్తే మిగతా వారికి కూడా ఈ ఫీవర్ బారిన పడే అవకాశం ఉంది. ఈ జ్వరంలో రోగికి 103 నుంచి 107 ఫారిన్ హీట్ వరకు జ్వరం ఉంటుంది. గొంతు నొప్పి, జలుబు, ఆకలి మందగించడం, తలనొప్పి, ఒంటి నొప్పులు వంటి లక్షణాలు కనిపిస్తాయి.

మలేరియా

వర్షాకాలంలో దోమకాటుతో వచ్చే వ్యాధుల్లో మలేరియా ప్రధానమైంది. దోమ కుట్టిన 10 నుంచి 14 రోజులలోపు అది లక్షణాలు బయటపడతాయి. రోజు విడిచి రోజు జ్వరం రావడం, తలనొప్పి, ఒంటి నొప్పులు, చలి ఎక్కువగా ఉంటుంది. చెమటలు పట్టడం, కొన్ని సార్లు వాంతులు కూడా వచ్చే అవకాశం ఉంది. జ్వరం వచ్చిన తొలి రోజునే మలేరియాను నిర్ధారించవచ్చునని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఈ వ్యాధికి సకాలంలో చికిత్స పొందకపోతే కాలేయం, కిడ్నీ, గుండె, రక్తనాళాలపై ప్రభావం చూపి రోగి కోమాలోకి వెళ్లే ప్రమాదం కూడా పొంచి ఉంది.

డెంగీ

దోమ కుట్టిన వారం తర్వాత ఆకస్మికంగా తీవ్రమైన జ్వరం వస్తుంది. కళ్లు కదిలించలేని పరిస్థితి ఎదురవుతుంది. ఎముకలు, కండరాల్లో భరించలేని నొప్పి వస్తుంది. కొందరి శరీరంపై పొక్కులు, దద్దుర్లు వంటివి వస్తాయి. వాంతులు, వికారం, రక్తంతో కూడిన మలవిసర్జన కనిపిస్తాయి. ఈ వ్యాధికారక వైరస్ రక్తంలో ఉత్పత్తి అవుతున్న ప్లేట్‌లెట్స్‌ను తినేస్తుంది. ఫలితంగా రక్తంలో ప్లేట్‌లెట్ సంఖ్య గణనీయంగా తగ్గి అంతర్గత రక్తస్రావం అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని వైద్యులు సూచిస్తున్నారు. నీటిపై ఉండే దోమ ద్వారా ఈ వ్యాధి వ్యాపిస్తుంది. అందుకే నిలువ ఉంచిన బిందెలను కచ్చితంగా మూతలు ఉంచాలి. నిర్లక్ష్యం చేయకుండా వైద్యుల సూచనల మేరకు మాత్రమే చికిత్స పొందాలి.

చికున్ గున్యా

డెంగీ కారక దోమకాటుతోనే చికున్‌గున్యా వ్యాధి సోకుతుంది. గున్యా వైరస్ బారిన పడిన వారిని కుట్టిన దోమ మరొకరికి కుట్టడం ద్వారా ఈ వ్యాధి వ్యాపిస్తుంది. ఈ రకమైన జ్వరం వచ్చి న వారికి ఒంటి నొప్పులు, తీవ్రమైన కీళ్ల నొప్పులు ఉండి కాళ్లు చేతుల్లో వాపులు కనిపిస్తాయి. మూడు నుంచి ఆరు నెలలపాటు ఈ నొప్పులు తగ్గవని వైద్యులు చెబుతున్నారు.

డయేరియా



కలుషిత నీరు, ఆహారం, నిల్వ ఉన్న ఆహార పదార్థాలు తీసుకోవడం వల్ల దయేరియా సోకుతుంది. వ్యాధిసోకిన వారికి నీళ్ల విరోచనాలు అవుతాయి. రోజుకు నాలుగు నుంచి ఐదుసార్లు విరోచనాలు అయితే డయేరియాగా గుర్తించాలి. అయితే రోగికి రోజులో పది నుంచి 20 సార్లు నీళ్ల విరోచనాలు అవుతాయి. వాంతులు కూడా ఎక్కువగా ఉంటాయి. కలుషితం వల్ల ఈ వ్యాధి సంభవిస్తుంది. కాబట్టి కుటుంబ సభ్యులతోపాటు పరిసర ప్రాంతాల్లోని ప్రజలందరూ అనారోగ్యాని కి గురయ్యే అవకాశం ఉంటుంది. వ్యాధికి గురైన వారు బాగా నీరసించడం, సురుకు తగ్గిపోయి మాట్లాడలేకపోవడం లాంటి లక్షణాలు కనిపిస్తాయి.

జాగ్రత్తలు

డయేరియా సోకిన రోగికి కాసి చల్లార్చిన నీటిని మాత్రమే తాగించాలి. కొబ్బరినీళ్లు, మజ్జిగ, కొన్ని రకాల శీతల పానీయాలు ఇవ్వాలి. లీటర్ నీటికి ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు కలిపి మూడు నుంచి నాలుగు గంటలకు ఒకసారి తాగించాలి. ఈ సీజన్‌లో సాధ్యమైనంత వరకు బయట ఆహారం తినకుండా ఉండటం మంచిది. నిల్వ ఉన్న ఆహార పదార్థాలను తినవద్దు. విరేచనానికి వెళ్లి తర్వాత తప్పనిసరిగా సబ్బుతో చేతులు శుభ్రం చేసుకోవాలి.

విరోచనాలు

ఫుడ్ పాయిజన్ కారణంగా కొన్ని సమయాల్లో తీవ్రమైన కడుపునొప్పి వచ్చి రక్త విరోచనాలు అవుతాయి. రక్తంతో కూడిన విరోచనాలు కావడంతో రోగి భయపడే ఆస్కారం కూడా ఉంటుంది.

ఇంట్లో దోమలు ప్రబలకుండా చూసుకోవాలి

అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ గౌతమ్, జనరల్ మెడిసిన్ విభాగం, ఎంజీఎం ఆస్పత్రి



ఇంటి పరిసరాలలో నీటి నిల్వలు ఉండకుండా చూసుకోవాలి. శుభ్రమైన మంచినీటిని మాత్రమే తాగాలి. బయట పదార్థాలకు దూరంగా ఉండాలి. ఇంట్లో ఆహారం తినే ముందు కాళ్లు చేతులు పరిశుభ్రంగా కడుక్కోవాలి. ఇంట్లో దోమలు వృద్ధి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఇంటి ఆవరణలో పాత టైర్లు, తాగి పడేసిన కొబ్బరి బోండాలలో వర్షం నీరు నిలవడంతో దోమలు పెరుగుతాయి. దోమలు వ్యాప్తి చెందకుండా నివారించగలిగితే వ్యాధులు సోకే అవకాశం కూడా ఉండదు. ఆ దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలి.

వరంగల్ ఆర్టీసీ ఆర్ఎం శ్రీలత బదిలీ

నూతన ఆర్ఎంగా విజయభాను

బాలసముద్రం, జూన్ 15: వరంగల్ ఆర్టీసీ రీజినల్ మేనేజర్ జె.శ్రీలత బదిలీ అయ్యారు. శనివారం రాష్ట్రవ్యాప్తంగా జరిగిన బదిలీల్లో భాగంగా ఆర్ఎం శ్రీలత రంగారెడ్డి జిల్లాకు బదిలీ కాగా, హైదరాబాద్‌లో చార్మినార్ డిప్యూటీ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న విజయభాను వరంగల్ రీజినల్ మేనేజర్‌గా నియామకమయ్యారు. కాగా, 2022 నవంబరు 18న వరంగల్ రీజినల్ మేనేజర్‌గా శ్రీలత విధుల్లో చేరారు. మేడారం జాతర సందర్భంగా ఆర్టీసీ సేవలు అందించి ప్రజల నుంచి మన్ననలు పొందారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని ఉమ్మడి జిల్లాలో విజయవంతంగా అమలు జరిగే విధంగా చర్యలు చేపట్టారు.

టెస్కాబ్ కార్యాలయంలో మార్నేనికి సన్మానం

హనుమకొండ సిటీ, జూన్ 15: తెలంగాణ రాష్ట్ర కో-ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావును ఉద్యోగ సంఘాల ప్రతినిధులు సన్మానించారు. చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన తరువాత రవీందర్‌రావు తొలిసారిగా శనివారం హైదరాబాద్‌లోని టెస్కాబ్ ప్రధాన కార్యాలయంలో తెలంగాణలోని డీసీసీ బ్యాంకుల చైర్మన్లు, ఉద్యోగులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ డిస్ట్రిక్ కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రియాజుద్దీన్, ప్రధాన కార్యదర్శి సర్వేశ్వరరావు, కోశాధికారి అభయ్‌కుమార్ తదితరులు మార్నేనికి పుష్పగుచ్ఛాలు అందచేసి అభినందనలు తెలిపారు. పూలమాలలు, శాలువాతో సన్మానించారు.

మార్కెట్లో పనుల కోసం టెండర్ల ఆహ్వానం

వరంగల్ వ్యవసాయం, జూన్ 15: ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలోని పలు పనుల నిర్వాహణ కోసం టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శి గుగులోతు రాము శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏనుమాముల మార్కెట్‌లో పల్లికాయ, పసుపు, పత్తి, మిర్చి, ధాన్యం, అపరాల యార్డులతోపాటు లక్ష్మీపురంలోని పాత, కొత్త మోడల్ కూరగాయల మార్కెట్‌లకు సంబంధించి జూలై 1 నుంచి 2025 మే 31 వరకు యార్డు క్లీనింగ్, పాన్ షాపులు, క్యాంటీన్ నిర్వాహణ, మరుగుదొడ్లకు సంబంధించి టెండర్లను ఆహ్వానించారు.

ఈ పనులు సంబంధించి మార్కెట్ కార్యాలయం పని వేళల్లో రూ.2000 చెల్లించి టెండర్ షెడ్యూల్ జూన్ 18 నుంచి 24 తేదీ వరకు పొందవచ్చని తెలిపారు. జూన్ 26న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు లక్ష రూపాయల ఈఎండీ చెల్లించిన వారివి స్వీకరించబడునని, అదే రోజు సాయంత్రం 3 గంటలకు టెండర్లను తెరువబడుతాయని కార్యదర్శి ప్రకటనలో తెలిపారు.

ప్రజలు మోదీకి తగిన గుణపాఠం చెప్పారు..

సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి



ధర్మసాగర్ మండల కేంద్రంలో సీపీఐ జిల్లా శిక్షణ తరగతుల కార్యక్రమంలో మాట్లాడుతున్న వెంకట్‌రెడ్డి.

ధర్మసాగర్, జూన్ 15: దేశంలోని ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి, భారత రాజ్యాంగాన్ని ప్రమాదంలోకి నెట్టడం వల్లే లోక్‌సభ ఎన్నికల్లో మోదీ ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెప్పారని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. ధర్మసాగర్ మండల కేంద్రంలో శనివారం జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి శిక్షణా తరగతుల కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. మోదీ పదేళ్ల పాలనలో అంబేద్కర్ రాసిన రాజ్యాంగానికి విభిన్నంగా పాలన జరిగిందన్నారు. దేశంలో ప్రశ్నించే గొంతులకను అణిచివేసి అనేక మందిపై అక్రమ కేసులు నమోదు చేసి జైలుకు పంపారని తెలిపారు. రైతులు, కార్మికులకు వ్యతిరేక చట్టాలు తెచ్చి ప్రజల సంపదను కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టారన్నారు. చివరకు తెలంగాణకు రావాల్సిన విభజన హామీలను అమలు చేయకుండా మోసం చేశారన్నారు. దీంతోనే చావుతప్పి కన్ను లొట్టబోయిన విధంగా బీజేపీకి కేంద్రంలో మెజారిటీ రాలేదని తెలిపారు. టీడీపీ, జేడీయూ మద్దతుతో కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిందన్నారు. లోక్‌సభకు ఎన్నికైన వారిలో 259మంది నేరచరిత్ర గల వారు ఎంపీలుగా ఉన్నారని చెప్పారు. మంత్రి వర్గంలో కూడా నేర చరిత్ర ఉన్న వారితో నిండిపోయిందని ఆయన ఆరోపించారు. గతం కంటే ఇండియా కూటమి అధిక సీట్లు గెలిచి కేంద్రంలో ప్రతిపక్షంగా నిలిచిందన్నారు. వామపక్షాలు లేకుంటే ప్రజల మేలుకోరే చట్టాలు వచ్చేవి కావని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా ఇష్టారీతిగా వ్యవరించడంవల్ల ప్రజలు ఇంటికి సాగనంపారని తెలిపారు. ప్రజలను విస్మరించి పాలన చేసిన వారికి ఇక్కట్లు తప్పవని ఆయన హెచ్చరించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీనివాసరావు, రాజమౌళి, మాజీ ఎమ్మెల్యే రాజారెడ్డి, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ శాఖలో ట్రాన్స్‌ఫర్స్ ఫీవర్



- బదిలీలపై స్పష్టత ఇవ్వని ప్రభుత్వం
- ఏ ప్రాతిపదికన బదిలీలు చేస్తారో తెలియని పరిస్థితి
- మంచి స్థానం కోసం మొదలైన ముందస్తు పైరవీలు

రాంనగర్, జూన్ 15: రిజిస్ట్రేషన్ శాఖలో బదిలీల ఫీవర్ ప్రారంభమైంది. నెలాఖరులోగా బదిలీల ప్రక్రియ పూర్తి చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తుండటంతో శాఖ ఉద్యోగులు ముందస్తు పైరవీలకు తెరలేపారు. ఏ ప్రాతిపదికన బదిలీలు చేస్తారో ప్రభుత్వం నుంచి స్పష్టత రానప్పటికీ ఎవరి స్థాయిలో వారు పైరవీలకు శ్రీకారం చుట్టారు. సబ్ రిజిస్ట్రార్‌లు ఆర్థిక లావాదేవీలు పుష్టిగా ఉన్నటువంటి స్థానాలను కైవసం చేసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. కింది స్థాయి ఉద్యోగులు ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలో స్థానం పొందేందుకు యత్నిస్తున్నట్లు తెలిసింది. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం తర్వాత పదేళ్ల కాలంలో 2022లో కేవలం సబ్ రిజిస్ట్రార్‌లను ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలో బదిలీలు చేశారు. కింది స్థాయి ఉద్యోగులను పదేళ్ల నుంచి కదుపలేదు. కింది స్థాయి ఉద్యోగులకు పదేళ్లుగా పదోన్నతులు సైతం కల్పించలేదు. నగర ప్రాంత సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో విధులు నిర్వహించే వారు అన్ని రకాలుగా లబ్ధి పొందుతుండగా గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసేవారు అన్ని రకాలుగా నష్టపోతున్నారు. పదేళ్లుగా బదిలీల కోసం వేచి చూస్తున్న ఉద్యోగులు కోరుకున్న స్థానం కోసం లాబీయింగ్ చేస్తున్నారు.

స్పష్టత ఇవ్వని ప్రభుత్వం

రిజిస్ట్రేషన్ శాఖ బదిలీలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదు. రెండేళ్ల కిందట సబ్ రిజిస్ట్రార్‌ల బదిలీలు చేసిన గత ప్రభుత్వం.. 317 జీవో (జోన్ పరిధిలో) ప్రకారం ప్రక్రియ పూర్తి చేసింది. జిల్లాల వారిగా జాబితా తీసుకున్న ప్రభుత్వం.. పోస్టింగ్‌లు కేటాయిస్తూ జీవో జారీ చేసింది. ఈ జీవో ఆదారంగా సబ రిజిస్ట్రార్‌లు భద్రాద్రికొత్తగూడెం జోన్ పరిధిలోని వరంగల్, హనుమకొండ, ఖమ్మం, మహబూబాబాద్, కొత్తగూడెం జిల్లాల్లో పోస్టింగ్ పొందారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం గత ప్రభుత్వం చేసిన బదిలీలను తప్పుపట్టినప్పటికీ ఎలా చేయబోతుందనే విషయమై స్పష్టత ఇవ్వలేదు. జీరో సర్వీసు తీసుకుంటుందా? రెండు లేదా మూడు సంవత్సరాల ఒకే స్థానంలో చేసిన సర్వీసును పరిగణలోకి తీసుకుంటుందా? జోన్, మల్టీజోన్ స్థాయిలో బదిలీలు చేస్తుందా? తెలియని పరిస్థితి. గత ప్రభుత్వం చేసినట్లు బదిలీల స్థానం కేటాయించి జీవో ఇస్తుందా? అనే ఆందోళన ఉద్యోగుల్లో ఉంది. ఒక వేళ మల్టీ జోన్ తీసుకుంటే గ్రేడ్-1 సబ్ రిజిస్ట్రార్‌లో కొమురంభీం, ఆసిఫాబాద్, రాజన్న సిరిసిల్ల, భద్రాద్రి కొత్తగూడెం జోన్‌ల పరిధిలోని జిల్లాలకు బదిలీ అవుతారు. నెలాఖరులోగా ప్రక్రియ పూర్తి చేయనున్న ప్రభుత్వం ఇప్పటి వరకు ఉద్యోగుల వివరాల జాబితా సైతం తీసుకోలేదు. దీనితో అసలు ఈ శాఖలో బదిలీలు జరుగుతాయా? లేక మినహాయింపు ఇస్తారా అనే అనుమానాలు సైతం వ్యక్తం అవుతున్నాయి.

పోస్టింగ్‌ల కోసం ముందస్తు లాబీయింగ్

శాఖ ఉద్యోగులు మంచి పోస్టింగ్ కోసం ముందస్తు లాబీయింగ్ ప్రారంభించారు. జీరో సర్వీసుతో నేరుగా పోస్టింగ్ ఆర్డర్స్ వస్తాయనే ప్రచారం సాగుతుండటంతో పైరవీలు ముమ్మరం చేశారు. జోన్, మల్టీజోన్‌పై స్పష్టత రాకపోవడంతో ముఖ్యంగా సబ్ రిజిస్ట్రార్‌లు ఆర్థిక లావాదేవీలు అధికంగా ఉండే పోస్టింగ్‌ల కోసం ప్రయత్నాలు సాగిస్తున్నట్లు తెలిసింది. ప్రస్తుతం కొనసాగుతున్న ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని బెటర్ స్థానం దక్కించుకునేందుకు మంత్రులు, ఎమ్మెల్యే వద్ద పడిగాపులు కాస్తున్నట్లు సమాచారం. బెటర్ పోస్టింగ్ కోసం ఎంతైనా ముట్టచెప్పేందుకు సిద్ధమైనట్లు తెలిసింది. కాగా జీరో సర్వీసును పరిగణలోకి తీసుకుని బదిలీలు జరిగితే ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని 13 కార్యాలయాల పరిధిలో అన్ని క్యాడర్‌లకు చెందిన 96మంది (40 జూనియర్ అసిస్టెంట్లు, 21 అటెండర్లు, 3 క్యాషియర్లు, 1 టైపిస్టు, 14 సీనియర్ అసిస్టెంట్లు,14 సబ్ రిజిస్ట్రార్‌లు, 2 డీఆర్‌లు, 1 డీఐజి) స్థాన చలనం చెందే అవకాశం ఉంది.

ఫిట్‌లెస్ బడి బస్సులు

- సామర్థ్య పరీక్షలపై అలసత్వం
- ముందుకు రాని స్కూల్ యాజమాన్యాలు
- ప్రతి ఏటా ఇదే తంతు

కృష్ణకాలనీ (భూపాలపల్లి), జూన్ 15: బడి బస్సుల్లో విద్యార్థుల భద్రత ప్రశ్నార్థకంగా మారింది. ఫిట్నెస్ కొరవడినా అడిగే నాథుడే కరువయ్యాడు. ధనార్జనే ధ్యేయంగా ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు పిల్లల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారనే విమర్శలు వస్తున్నాయి. వేసవి సెలవులు ముగిశాక స్కూల్ బస్సులకు ప్రతి ఏటా ఫిట్‌నెస్ పరీక్షల చేయించాకే పిల్లలను ఎక్కించాలనే నిబంధన ఉన్నా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. జిల్లాలో ఈ రూల్స్ ఎక్కడా పాటించిన దాఖలాలు లేవని తెలుస్తోంది. ప్రతి ఏటా లాగే ఈసారి కూడా బస్సులు ఫిట్‌నెస్‌ను పరిగణనలోకి తీసుకోకుండానే బయల్దేరాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు రవాణాశాఖ అధికారులు సైతం పెద్దగా దృష్టి పెట్టడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. తమ కార్యాలయానికి వచ్చిన బస్సులను పరీక్షించకుండానే గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని పలువురు బహిర్గతంగానే చర్చించుకుంటున్నారు. అనేక స్కూల్ యాజమాన్యాలు పాత బస్సులకే మెరుగులు దిద్ది రంగంలోకి దింపాయనే విమర్శలు వస్తున్నాయి. ఫిట్‌నెస్ లేని బస్సులను యాజమాన్యాలు నడిపించినా సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.



ఎందుకింత నిర్లక్ష్యం?

పాఠశాలల బస్సులను తప్పనిసరిగా ఫిట్‌నెస్ చేయించాలనే నిబంధన ఉంది. కానీ, జిల్లాలో ఆయా పాఠశాలల యాజమాన్యాలు అలసత్వం వహించడంలో ఆంతర్యమేమిటనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. అసలు ఫిట్‌నెస్ అవసరం లేదనే ధోరణితో అనేక స్కూల్ యాజమాన్యాలు ఉన్నాయని, విద్యార్థులకు ఏదైనా ప్రమాదం జరిగితే పరిస్థితి ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. రవాణా శాఖలోని కొంత మంది సిబ్బందిని మచ్చిక చేసుకొని ఉండటంతోనే స్కూల్ యాజమాన్యాలు ఇష్టారీతిగా వ్యవహరిస్తు న్నాయనే ఆరోపణలు వస్తున్నాయి. ఫిట్‌నెస్ పత్రాలు లేని బస్సులు రోడ్డెక్కితే కఠిన చర్యలు తీసుకుంటామని రవాణాశాఖ అధికారులు చెబుతున్నప్పటికీ అదంతా ఒట్టి ముచ్చట్లే అనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

చాలా మంది పిల్లలు బస్సుల్లోనే...

జిల్లా వ్యాప్తంగా చాలా వరకు ప్రైవేటు పాఠశాల విద్యార్థులు చుట్టు పక్కల గ్రామాల నుంచి బస్సుల్లోనే వస్తూ వెళ్తుంటారు. పాఠశాల బస్సు అయితేనే పాఠశాల నుంచి ఇంటికి.. ఇంటి నుంచి పాఠశాలకు సులభతరం అవుతుందనే ఉద్దేశంతో తల్లిదండ్రులు ఏడాదికి చొప్పున వేలల్లో ప్రత్యేక రుసుము చెల్లించుకుంటూ పిల్లలను పంపిస్తున్నారు. ఈ క్రమంలో ఫిట్‌నెస్ లేకుండానే బస్సులను నడిపిస్తుండటంతో తల్లిదండ్రులు ఆందోళన చెందాల్సి వస్తోంది.

జిల్లా వ్యాప్తంగా 12 మండలాల్లో మొత్తంగా 143 బడి బస్సులు ఉన్నాయి. వీటిల్లో ఇప్పటి వరకు 92 బస్సులకు ఫిట్నెస్ పూర్తి అయినట్లు రవాణాశాఖ అధికారులు చెబుతున్నారు. ఇంకా 51 బస్సులకు ఫిట్నెస్ చేయాల్సి ఉంది. అయితే ఈ మొత్తం బస్సులు కండీషన్‌లేనివే అనే ఆరోపణలు వస్తున్నాయి. ఎప్పుడైనా ప్రమాదం జరిగే ఆస్కారమున్న వాహనలే. పాఠశాలలు పునఃప్రారంభమైన నేపథ్యంలో ఇప్పటికే కొన్ని బస్సులు ఇప్పటికే రోడ్డెక్కాయి. ఒక్కో వాహనానికి ఫిట్‌నెస్ సర్టిఫికేట్, డ్రైవర్‌కు అనుభవం ఉందా.. డ్రైవింగ్ లైసెన్స్ ఉందా..? అనే విషయాలపై విచారించాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఆన్‌లైన్‌లో బుక్ చేసుకొని ఫిట్‌నెస్ పరీక్షకు రావాల్సి ఉంటుందంటున్న రవాణాశాఖ అధికారులు.. అది లేని బస్సులు రోడ్డెక్కితే జరిగే ప్రమాదాలు గానీ, తీసుకునే చర్యలపై గానీ ఎలాంటి అవగాహన కార్యక్రమాలు చేపట్టకపోవడం వారి నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది.

విస్తృత తనిఖీలకు సర్కారు ఆదేశం

పాఠశాలల బస్సులు ఫిట్‌నెస్‌పై ఈసారి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగానే నాలుగు రోజుల రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులతో సమీక్ష నిర్వహించి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రమాదాలకు ఆస్కారం లేకుండా పాఠశాలలకు ముందుగానే పకడ్బందీగా తనిఖీలు చేపట్టాలన్నారు. దీంతో ర రవాణా శాఖ అధికారులు తనిఖీలపై దృష్టి సారించారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలో బడి బస్సులను రవాణా శాఖ ఇన్‌చార్జి డీటీవో, ఎంవీఐ సమ్మానీ తనిఖీలు చేశారు.

నిబంధనలు ఇవే..

- స్కూలు బస్సుకు పాఠశాల పేరు, ఫోన్ నంబర్, చిరునామా బస్సు ఎడవైపు పూర్తిగా కనిపించేలా ఉండాలి.
- డ్రైవర్ వయస్సు 60ఏళ్లకు మించరాదు.
- తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలి.
- బస్సులో అగ్ని ప్రమాద నివారణ పరికరాలు అందుబాటులో ఉండాలి.
- సీట్లు, అద్దాలు, టైర్లు తదితర బస్సు సామగ్రి అంతా అన్ని సక్రమంగా ఉన్నాయా.. లేదా? అనే విషయాన్ని ఎప్పటికప్పుడు సరి చూసుకోవాలి.

ఫిట్‌నెస్ లేకుండా నడిపితే సీజ్

- సమ్మానీ, ఇన్‌చార్జి డీటీవో, ఎంవీఐ



పాఠశాలల బస్సులు ఫిట్‌నెస్ లేకుండా నడిపితే సీజ్ చేస్తాం. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా తప్పనిసరిగా ఫిట్‌నెస్ పరీక్షలు చేయించుకోవాల్సిందే. నిబంధనలు అతిక్రమించి ఎవరైనా బస్సులను నడిపితే చర్యలు తప్పవు. ఇంకా ఫిట్‌నెస్‌కు రాని బస్సులు త్వరలోనే కార్యాలయంలో చేయించుకోవాలి. ఇక నుంచి నిరంతరం తనిఖీలు ఉంటాయి. తనిఖీల్లో పట్టుబడితే భారీ జరిమాన తప్పదు. అవసరమైతే సీజ్ కూడా చేస్తాం. అలాగే, ప్రతి వాహనానికీ సంబంధించి రోడ్డు టాక్స్ కూడా సకాలంలో చెల్లించాలి. అదిలేకుండా పట్టుబడితే 200 శాతం అధిక పెనాల్టీ చెల్లించాల్సి వస్తుంది.

ఆదివాసీల భూములకు హక్కు కల్పించాలి

తుడుందెబ్బ జిల్లా ఉపాధ్యక్షుడు సోమరాజు


దీక్షను ప్రారంభిస్తున్న సోమరాజు

వెంకటాపురం(నూగూరు), జూన్ 15: ఆదివాసీల సాగుభూములకు ప్రభుత్వం హక్కు కల్పించాలని తుడుందెబ్బ జిల్లా ఉపాధ్యక్షుడు చింత సోమరాజు డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట గోండ్వాన సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు శనివారం నాటికి ఆరో రోజుకు చేరుకు న్నాయి. ఈదీక్షను సోమరాజు ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ఏజెన్సీలో ఆదివాసీల సాగు భూములకు రెవెన్యూ అధికారులు రక్షణ కల్పించాలన్నారు. దీక్షలో నాయకులు పూనెం సాయి, ప్రతాప్, మనోజ్, రాజేష్, మునేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మహాజాతర డ్యూటీ డబ్బులు చెల్లించాలని అంగన్‌వాడీల వినతి

ములుగు కలెక్టరేట్, జూన్ 15: మేడారం సమ్మక్క, సారలమ్మ మహాజాతరలో విధులు నిర్వర్తించిన తమకు డబ్బులు చెల్లించాలని కోరుతూ అంగన్‌వాడీలు శనివారం సీఐటీయూ ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ సీహెచ్.మహేందర్‌జీకి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మహాజాతర ముగిసి మూడునెలలు దాటుతున్నా డ్యూటీ డబ్బులు చెల్లించకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని అన్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి డ్యూటీ డబ్బులు చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి సమ్మక్క, జిల్లా కమిటీ సభ్యురాలు సరిత, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలి : యువమోర్చా


ఎంఈవోకు వినతిపత్రం అందజేస్తున్న యువ మోర్చా నాయకులు

ములుగు కలెక్టరేట్, జూన్ 15: ములుగు మండలంలో అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బీజేపీ యువమోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి కత్తి హరీశ్ డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం ఆయన ఆధ్వర్యంలో నాయకులు ఎంఈవో సామల శ్రీనివా సులకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా హరీశ్ మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలల్లో డిగ్రీ, బీఈడీ పూర్తిచేసిన వారిని టీచర్లుగా తీసుకోవాలని, పుస్తకాలు, స్టేషనరీ, యూనిఫాం విక్రయాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని, ప్రతి పాఠ శాలలో ఫైర్ సేఫ్టీ నియమాలు పాటించాలని, విద్యార్థులకు సరిపడా సౌకర్యాలు కల్పించాలని అన్నారు. ఫీజుల పట్టికను నోటీస్‌బోర్డులో పెట్టాలని, స్కూల్ బస్సుల్లో సీట్లకు సరిపడా విద్యార్థులను ఎక్కించుకోవడంతోపాటు కిటికీలకు భద్రత ఏర్పాట్లు చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు జక్కుల కుమార్, నాయకులు రాజేష్, మహేష్, ప్రవీణ్, ఉదయ్, నరేష్, ఫణి, సిద్దు, కృష్ణ, విక్రాంత్,తదితరులు పాల్గొన్నారు.

మంత్రి తుమ్మలను కలిసిన ఎమ్మెల్యే గండ్ర


మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు వినతిపత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

భూపాలపల్లిటౌన్, జూన్ 15: రాష్ట్ర వ్యవసాయ, చేనేత, సహకార, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావును ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మర్యాద పూర్వంగా శనివారం కలిశారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందించారు. పలు సమస్యలపై వినతి పత్రాన్ని మంత్రికి సమర్పించారు. ముఖ్యంగా చేనేత కార్మికుల సమస్యలను పరిష్కరించాలని మంత్రిని కోరారు. దీనిపై స్పందించిన మంత్రి తుమ్మల త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో చర్చించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ నాయకులు ఎన్ఎస్ఆర్ సంపత్‌రావు, గండ్ర సత్యనారాయ ణరెడ్డి, కిషన్‌రావు తదితరులు ఉన్నారు.

టాపర్లను అభినందించిన ఎమ్మెల్యే, కలెక్టర్

చిట్యాల : చిట్యాల ప్రభుత్వ జూనియర్ కళాశాల టాపర్లను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, కలెక్టర్ భవేష్‌మిశ్రా శనివారం అభినందించారు. కళాశాలకు చెందిన జి.మాధురి ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపీసీలో 463 మార్కులు, యు.అజయ్ ద్వితీయ సంవత్సరంలో ఎంపీసీలో 978 మార్కులు సాధించి జిల్లా టాపర్లుగా నిలిచారు. ఈమేరకు కళాశాల ప్రిన్సిపాల్ శరద్‌ృతి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం, కలెక్టర్ కార్యాలయంలో వారిని కలిశారు. ప్రభుత్వ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడం పట్ల ఉపాధ్యాయులను అభినందించారు.

ఈఏడాది కళాశాలలో అడ్మిషన్లు పెంచాలని, 100 శాతం ఉత్తీర్ణతకు కృషి చేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

సరస్వతీ బ్యారేజీ వద్ద ఇసుక నిల్వలు

పూర్తిగా తొలగించాలన్న ఎన్‌డీఎస్‌ఏ

మహదేవపూర్, జూన్ 15: కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా మండలంలోని అన్నారం వద్ద నిర్మించిన సరస్వతీ బ్యారేజీలో ఇసుక పేరుకుపోయింది. దీంతో బ్యారేజీ భద్రత కష్టతరంగా మారింది. నది అంతర్భాగంలో అడ్డుకట్టలు ఉండటంతో వరదల సమయంలో ఎగువ ప్రాంతాల నుంచి ఇసుక కొట్టుకొచ్చి బ్యారేజీ వద్ద ఆగుతోంది. దీంతో బ్యారేజీల్లో బంగలు ఏర్పడుతున్నట్లు నేషనల్ డ్యామ్ సేఫ్టీ (ఎన్‌డీఎస్‌ఏ) అధికారులు తెలిపారు. నదీ గర్భంలో ఉన్న మొత్తం ఇసుకను తొలగిస్తే బ్యారేజీకి ఎలాంటి నష్టం వాటిల్లకుండా ఉంటుంది. ప్రస్తుతం వర్షాకాలం సమీపిస్తుండటంతో వెంటనే నదీ గర్భంలోని ఇసుకను మొత్తం తరలించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లేదంటే మేడిగడ్డ బ్యారేజీ జరిగిన నష్టం సరస్వతీ బ్యారేజీకి జరగనుంది. వెంటనే అధికారులు స్పందించి నదీ గర్భంలోని ఇసుకను తరలించాలి.


బ్యారేజీ వద్ద పేరుకుపోయిన ఇసుక

పెసా గ్రామ సభలను బలోపేతం చేయాలి


మాట్లాడుతున్న ప్రభాకర్

గోవిందరావుపేట, జూన్ 15: ఐదో షెడ్యూల్డ్ ఏరియాలో భారత రాజ్యాంగం ప్రకారం పెసా కమిటీల ఎన్నిక జరిగిందని జిల్లా కోఆర్డినేటర్ కొమురం ప్రభాకర్ అన్నారు. పెసా గ్రామసభలను బలోపేతం చేయాలన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాల యంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి రెండునెలల కోసారి పెసా గ్రామసభలు నిర్వహిం చాలన్నారు. అదేవిధంగా ఏజెన్సీ గ్రామాల్లో సీజనల్ వ్యాధులు, వరదలపై పెసా కమిటీలు పనిచేయాల్సిన అవసరం ఉ ందని అన్నారు. ఈ సమావేశంలో న్యాయవాది మడి సాయిబాబు, పెసా మండల అధ్యక్షులు యుగేందర్, కల్తి రమేష్, వట్టం సురేష్, మొబిలైజర్లు పాల్గొన్నారు.

మూఢనమ్మకాలపై అవగాహన

వెంకటాపురం(నూగూరు), జూన్ 15: మండలంలోని సుడిబాక గ్రామంలో శనివారం కాఫేడ్ స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో మూఢనమ్మకాలపై ప్రజలకు అవగాహన సదస్సు జరిగింది. ఈసందర్భంగా సభ్యులు మూఢనమ్మకాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. మూఢనమ్మకాలను ప్రజలు నమ్మొద్దని సూచించారు. ఈ సదస్సులో స్వచ్ఛందసంస్థ మండల కోఆర్డినేటర్ గొంది హనుమంతు, వాజేడు మండల కోఆర్డినేటర్ కామేష్, సభ్యులు ఉషారాణి, ఇందిర, నరేష్, ప్రశాంత్, పాఠశాల ఉపాధ్యాయుడు సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాల కరపత్రం ఆవిష్కరణ

వెంకటాపురం(నూగూరు), జూన్ 15: మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రభుత్వ జూనియర్ కళాశాల అడ్మిషన్లపై ప్రచారం చేసే కరపత్రాన్ని శనివారం తహసీల్దార్ వీరభద్రప్రసాద్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తగా ఏర్పడిన కళాశాలకు అవసరమైన ఏర్పాట్లు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అకడమిక్ ఇన్‌చార్జి అమ్మిన శ్రీనివాసరాజు, డీటీ మహేందర్, రెవెన్యూ సిబ్బంది సమ్మయ్య, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

చిన్నారిని చిదిమేసిన నిందితుడిని శిక్షించాలి

మాలమహానాడు అధ్యక్షుడు పీక కిరణ్

కాటారం, జూన్ 15:"పెద్దపల్లి జిల్లాలో చిన్నారిని దారుణంగా హత్యాచారం చేసిన నిందితు డిని బహిరంగంగా శిక్షించాలని ఉత్తర తెలంగాణ మాలమహానాడు అధ్యక్షుడు పీక కిరణ్ డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో కిరణ్ మాట్లాడుతూ మిల్లర్లు, ఇటుకబట్టీల యజమానులు ఇతర రాష్ట్రాల కార్మికుల కటుంబాలను తక్కువ వేతనాలకు తీసుకొచ్చి వారి భద్రతను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. గతేడాది ఇటుక బట్టీల్లో బాలికపై ఇదేరకమైన దుశ్చర్య జరిగినా అధికార యంత్రాంగం, పోలీసులు కఠినమైన చర్యలు చేపట్టకపోవడంతోనే ఇలాంటి సంఘటనలు పునరావృతం అవుతున్నాయని మండిపడ్డారు. ఇతర రాష్ట్రాల కార్మికుల పూర్తి వివరాలు పోలీసులు, కార్మిక శాఖ అధికారుల వద్ద ఉండాలన్నారు. చిన్నారిని హత్యాచారం చేసిన నిందితుడిని పోక్సో చట్టం ప్రకారం కఠినంగా శిక్షించి బాధిత కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు.

కొనసాగుతున్న 'డబుల్' లబ్ధిదారుల ఆందోళన


నిరసన తెలుపుతున్న డబుల్ బెడ్‌రూం లబ్ధిదారులు

భూపాలపల్లిటౌన్, జూన్ 15: డబుల్ బెడ్‌రూం ఇళ్ల సముదాయం వద్ద లబ్ధిదారుల ఆందోళన శనివారం కూడా కొనసాగింది. పట్టణంలోని భాస్కర్ గడ్డ సమీపంలోని డబుల్ బెడ్‌రూం 416 లబ్ధిదారులు ఈ ఆందోళన చేపడుతున్నారు. ఇళ్ల సముదాయం వద్ద టెంట్లు వేసుకొని నిరసన తెలుపుతున్నారు. తమకు న్యాయం జరిగేంత వరకు విరమించే లేదని భీష్మించుకున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భూపాలపల్లిటౌన్, జూన్ 15: విద్యుత్ లైన్ల మరమ్మతుల నేపథ్యంలో ఆదివారం కొంతసేపు సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ విశ్వాస్‌రెడ్డి శని వారం ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ మంజూర్‌నగర్ ఫీడర్ వద్ద చెట్లు కొట్టడంతో పలు మరమ్మతుల నేపథ్యంలో ఉదయం 7.30 నుంచి 11.30 గంటల వరకు పుల్లూరిరామయ్యపల్లి, మంజూర్‌నగర్, బీసీకాలనీ, వెంగళ్‌రావు కాలనీ, జీఎంఆర్‌కాలనీ, కుందురుపల్లి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

- ములుగు కలెక్టరేట్: ములుగు సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో ఆదివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ సాయికృష్ణ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 33కేవీ విద్యుత్‌లైన్, సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు జరుగనున్న నేపథ్యంలో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. ఈవిషయాన్ని సబ్‌స్టేషన్‌ల పరిధిలోని గ్రామాల ప్రజలు, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

18, 19 తేదీల్లో ఈపీ ఆపరేటర్ల పరీక్ష

కాకతీయఖని, జూన్ 15: సింగరేణిలో పనిచేస్తున్న ఈపీ ఆపరేటర్లకు ఈ నెల 18,19వ తేదీల్లో ఎంపిక పరీక్ష (డ్రైవింగ్ టెస్ట్) నిర్వహించనున్నట్లు ఏరియా అధికార ప్రతినిధి అజ్మీరా తుకారాం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సంస్థలో ఖాళీగా ఉన్న ఈపీ ఆపరేటర్ ట్రైనీ ఉద్యోగాల కోసం ఈ పరీక్షను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే కార్మికుల వద్ద నుంచి దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. అర్హత ఉన్న కార్మికులకు ఏరియాలోని అంబేద్కర్ క్రీడామైదానంలో డ్రైవింగ్ టెస్ట్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో పాస్ అయిన వారికి ఈ నెల 30న కొత్తగూడెంలోని సింగరేణి మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో రిటన్ టెస్ట్ ఉంటుందని వివరించారు.

పిచ్చికుక్క స్వైర విహారం


గాయపడిన సత్తెమ్మ

వాజేడు, జూన్ 15: మండంలోని పాయబాట్ల గ్రామంలో పిచ్చికుక్క శనివారం స్వైర విహారం చేసింది. ఇద్దరు వ్యక్తులు, ఆరు పశువులపై దాడి చేసింది. ఆరు పశువులను గాయపర్చిన కుక్క అటు నుంచి వస్తున్న జగన్నాథపురానికి చెందిన ముత్తెబోయిన సత్తెమ్మపై దాడి చేసింది. దీంతో ఆమెకు తీవ్రంగా గాయపడింది. అదే క్రమంలో గగ్గురి రఘుబాబు అనే యువకుడిపై దాడి చేసి చేతిని గాయపర్చింది. వీరిద్దరిని వాజేడు వైద్యశాలకు తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఏటూరునాగారం పంపారు. మండలంలో వీధి కుక్కలు ఇటీవల తరుచూ జనంపై, పశువులపై దాడి చేస్తున్నాయని, వాటిని అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.


ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి

మహదేవపూర్, జూన్ 15: తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఎంపీపీ రాణిబాయి, జడ్పీటీసీ అరుణ అన్నారు. మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం జరిగిన పేరెంట్ మీటింగ్‌లో వారు పాల్గొన్నారు. విద్యార్థులకు నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. హెచ్ఎం సరిత, ఏఏపీసీ చైర్ పర్సన్ స్వరాజ్యలక్ష్మి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ వామన్‌రావు, ఉపాధ్యాయులు మధు, రాజబాపు, సుధారాణి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'కస్తూర్బా'లో అడ్మిషన్ల వెల్లువ

మంగపేట, జూన్, 15: మంగపేటలోని విద్యా వనరుల కేంద్రం వెనుక ఉన్న కస్తూర్బా పాఠశాలలో తరగతులు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంపీవో లకావత్ రాజేష్ కుమార్ తెలిపారు. ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు ఇక్కడ విద్యాబోధన ఉంటుందని చెప్పారు. మండల విద్యా వనరులశాఖ కార్యలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేజీబీవీ నూతన భవన సముదాయాన్ని ప్రారంభించక ముందే విద్యార్థినుల అడ్మిషన్లు వెల్లువలా వచ్చాయ న్నారు. ఒక్కో తరగతి గది వసతి పరిమితి 40 మందికి మాత్రమే ఉన్నప్పటికీ ఇప్పటి వరకు ఆరో తరగతిలో 60 మంది, ఏడో తరగతిలో 40, ఎనిమిదో తరగతిలో 42, తొమ్మిదో తరగతిలో 25, పదో తరగతిలో ఒకరు, ఇంటర్ ఫస్టియర్ ఎంపీసీలో 11, బైపీసీలో 51 మంది, ఇంటర్ సెకెండియర్ బైపీసీలో ఏడుగురు అడ్మిషన్లు పొందారని వివరించారు. గత సంవత్సరం 52 మంది విద్యార్థినులు మాత్రమే ఉన్నారని, ఈ ఏడాది అదనంగా 230 మంది చేరారని తెలిపారు.

ఖాళీ బిందెలతో నిరసన


ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న గ్రామస్థులు

కృష్ణకాలనీ (భూపాలపల్లి) జూన్ 15: భూపాలపల్లి మండలంలోని పందిపంపుల గ్రామంలో తాగునీటి కోసం 40 కుటుంబాలు శనివారం ఆందోళనకు దిగాయి. గ్రామంలోని ప్రధాన రహదారిపై ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. వారం రోజులుగా తాగునీరు రాకపో వడంతో అనేక ఇబ్బందులు పడుతున్నామని, దీంతో రెండు కిలో మీటర్ల దూరంలో ఉన్న కాంపలి నుంచి తీసుకురావాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తాగునీరు సరఫరా జరిగేలా తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు.

గొత్తికోయగూడాల్లో పోలీసుల తనిఖీలు


గొత్తికోయలకు కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

ఏటూరునాగారం, జూన్ 15 : నక్సల్స్ ప్రభావిత ప్రాంతమైన ఏటూరునాగారం అడవులను పోలీసులు జల్లెడ పడుతున్నారు. మండలంలోని గొత్తికోయగూడాల్లో తనిఖీలను ముమ్మరం చేస్తున్నారు. ఆయా గూడాలల్లో స్పెషల్ పార్టీ, గ్రేహౌండ్స్ సివిల్, సీఆర్పీఎఫ్ పోలీసులు సంచరించి ఇంటింటా సోదాలు చేస్తున్నారు. సరిహద్దు ప్రాంతాల్లో వరుసగా ఎన్‌కౌంటర్లు జరుగుతున్న నేపథ్యంలో మావోయిస్టులు అడవుల్లోని గూడాలల్లో తలదాచుకుంటున్నారనే సమాచారం మేరకు పోలీసులు నిఘా పెట్టారు. ఆయా గ్రామస్థులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. గుర్తుతెలియని వ్యక్తులు ఎవరైనా సంచరిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని కోరారు. ఆర్టీసీ, ప్రైవేటు వాహనాలను తనిఖీలు చేసి అనుమానితులను అదుపులోని తీసుకొని విచారించి వదిలేశారు.

ఈసీ లేదు.. వీసీ లేరు..

(5వ పేజీ తరువాయి)

యూనివర్సిటీకి 149 మంది దరఖాస్తు చేసుకున్నారు. అయితే కేయూకు మినహా మిగతా తొమ్మిది యూనివర్సిటీలకు ప్రభుత్వం ఇటీవల సెర్చ్ కమిటీలను నియమించింది. ఈ సెర్చ్ కమిటీలు వచ్చిన దరఖాస్తులను పరిశీలించారు. ఈ నెలఖారులోగా తొమ్మిది యూనివర్సిటీలకు కొత్త వైస్‌చాన్సలర్‌లను నియమించనున్నారు. కానీ కాకతీయ యూనివర్సిటీకి మాత్రం ఇన్‌చార్జి వీసీనే దిక్కుగా మారనున్నారనే చర్చ జరుగుతోంది. అయితే కేయూకు కొత్త పాలక మండలి నియామకం తరువాతే సెర్చ్ కమిటీని ఏర్పాటు చేస్తారని, ఆ తరువాతనే కొత్త వీసీ వచ్చే అవకాశాలు ఉన్నాయని సమాచారం. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే కాకతీయ యూనివర్సిటీకి పాలక మండలిని నియమించి, వీసీ నియామకం కోసం సెర్చ్ కమిటీని కూడా ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, విద్యావేత్తలు, ప్రొఫెసర్లు విజ్ఞప్తి చేస్తున్నారు.

ముగిసిన సీపీఎం శిక్షణ తరగతులు

కాకతీయఖని, జూన్ 15: సీపీఎం ఆధ్వర్యంలో రెండు రోజులపాటు జరిగిన జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు ముగిశాయి. భూపాలపల్లి పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఈ శిక్షణ తరగతులు జరిగాయి. శనివారం కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకుడు వెంకటేశ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా విలేకరులతో ఆయన సమావేశమయ్యారు. సమాజం మార్పుకు వర్గపోరాటాలే చోధక శక్తి అన్నారు. కారల్‌మార్క్స్ సిద్ధాంతమే సకల సమస్యలకు పరిష్కార మార్గమన్నారు. దేశంలో నిరుద్యోగం పెరిగిందని, కనీస కూలి రేట్లు కరువయ్యా యని అన్నారు. ఉపాధి పనులు అడుగంటాయని, ప్రజల్లో కొనుగోలు శక్తి సన్నగిల్లుతోందని అన్నారు. ఆకలి చావులు, ఆత్మహత్యలు పెరిగాయన్నారు. ఉచిత వైద్యం, విద్య పేదలకు అందడం లేదన్నారు. దేశంలో పెట్టుబడి దారులు, భూస్వాములు పెరుగుతు న్నారన్నారు. దళి తులు, గిరిజనుల మీద దాడులు పెరిగాయన్నారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి సాయిలు, నాయకులు దేవేందర్, రాజయ్య, శ్రీకాంత్, ప్రీతి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర నాయకుడు వెంకటేశ్

19న వాహన విడి భాగాలకు వేలం

కృష్ణకాలనీ (భూపాలపల్లి), జూన్5 : పోలీసుశాఖకు సంబంధించిన నిరుపయోగంగా ఉన్న వాహన విడి భాగాలకు ఈ నెల 19న వేలం నిర్వహిస్తున్నట్లు ఎస్పీ కిరణ్‌ఖరే వెల్లడించారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ వేలంలో ఎవరైనా పాల్గొనొచ్చని పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు వేలం ప్రారంభమవుతుందని, ఆసక్తి ఉన్న వారు ఆధార్‌కార్డు లేదా ఏదైనా గుర్తింపు కార్డుతో పాటు రూ.3 వేల ధారవత్తు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. కనుగోలు చేయని వారి రుసుముని తిరిగి చెల్లించనున్నట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు ఆర్మ్‌డ్ రిజర్వ్ కార్యాలయ 8712658170 నంబరుపై సంప్రదించాలని సూచించారు.